క్లుప్తంగా

ఇంటి నిర్మాణానికి సిమెంట్ అందజేత



ముచ్చర్లలో వెంకటేశ్‌కు సిమెంట్ అందిస్తున్న మహేందర్

కందుకూరు: మండల పరిధిలోని ముచ్చర్లలో గ్రామానికి చెందిన నిరుపేద వ్యక్తి కుమ్మరి వెంకటేశ్ ఇంటి నిర్మాణానికి బీజేపీ నాయకుడు ఊటు మహేందర్ ఆర్థికసాయం అందించాడు. నిర్మాణానికి గాను రూ.20 వేల విలువైన 50 బస్తాల సిమెంట్‌ను అందజేశారు.

సమాజ శ్రేయస్సుకు కృషి



మాట్లాడుతున్న సహ సంఘటన కార్యదర్శి బాలకృష్ణ

కందుకూరు: సమాజ శ్రేయస్సు కోసం ఆర్‌ఎస్‌ఎస్ నిరంతరం పనిచేస్తోందని అఖిల భారతీయ సహ సంఘటన కార్యదర్శి బాలకృష్ణ, ముఖ్యఅతిథి విజ్ఞాన్ కళాశాల ప్రిన్సిపాల్ ఎడ్ల బాబురావు అన్నారు. ఆర్‌ఎస్‌ఎస్ ఆధ్వర్యంలో బుధవారం సాయంత్రం మండల పరిధిలోని కొత్తగూడలో సంఘ శతాబ్ది ఉత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. 1925లో స్థాపించిన ఆర్‌ఎస్‌ఎస్ నేటికీ సమాజ శ్రేయస్సు కోసం నిరంతరం శ్రమిస్తూనే ఉందన్నారు. ప్లాస్టిక్ నిషేధించి.. స్వదేశీ వస్తువుల వినియోగాన్ని ప్రోత్సహిస్తున్నామన్నారు. అంటరానితనాన్ని నిర్మూలించి ఆదర్శ హిందూ గృహం లక్షణాల్ని పాటిస్తూ ధర్మ నీరతి కోసం కుటుంబ జీవనాన్ని సాగించాలని కోరారు. కార్యక్రమంలో స్వయం సేవకులు, నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

పరామర్శ



బీఆర్‌ఎస్ నాయకుడు మాధవ్‌రెడ్డిని పరామర్శిస్తున్న మాజీ మంత్రి సబితారెడ్డి

చేవెళ్ల: మున్సిపాలిటీ పరిధిలోని మల్కాపూర్‌లో బీఆర్‌ఎస్ సీనియర్ నాయకుడు, పీఏసీఎస్ డైరెక్టర్ మాధవ్‌రెడ్డి తల్లి ఇటీవల మృతి చెందింది. ఈ విషయం తెలుసుకున్న మాజీ మంత్రి పి.సబితారెడ్డి బుధవారం బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. చేవెళ్లలో పార్టీ సమావేశానికి హాజరైన ఆమె సమావేశం అనంతరం మల్కాపూర్‌కు వెళ్లి మాధవ్‌రెడ్డిని కలిసి పరామర్శించారు. ఆమె మృతికి సంతాపం ప్రకటించి కుటుంబ సభ్యులను ఓదార్చారు. ఆమె వెంట బీఆర్‌ఎస్ నాయకుడు, డీసీఎంఎస్ మాజీ చైర్మన్ పి.కృష్ణారెడ్డి, నాయకులు ఆంజనేయులు, కరుణాకర్‌రెడ్డి, ప్రభాకర్, శ్రీధర్‌రెడ్డి, శివప్రసాద్, గోపాల్‌రెడ్డి, మాణిక్యరెడ్డి, గ్రామ నాయకులు తదితరులు ఉన్నారు.

స్థానిక ఎన్నికల్లో సత్తాచాటాలి

జెడ్పీటీసీ మాజీ సభ్యుడు అవినాశ్‌రెడ్డి



మాట్లాడుతున్న అవినాశ్‌రెడ్డి

షాబాద్: రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్‌ఎస్ పార్టీ సత్తా చాటాలని జెడ్పీటీసీ మాజీ సభ్యుడు పట్నం అవినాశ్‌రెడ్డి అన్నారు. బుధవారం మండల కేంద్రంలో బీఆర్‌ఎస్ పార్టీ కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాన్నున స్థానిక ఎన్నికలపై దిశానిర్దేశం చేశారు. బీఆర్‌ఎస్ పార్టీ కార్యకర్తలు సత్తాచాటాలని, కష్టపడే ప్రతీ కార్యకర్తకు తగిన గుర్తింపు ఉంటుందని తెలిపారు. ఎన్నికల్లో బీఆర్‌ఎస్ పార్టీ ఘన విజయం సాధిస్తుందని ధీమా వ్యక్తం చేశారు. కాంగ్రెస్ పార్టీకి బుద్ధి చెప్పేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు ఉన్నారు.

ముగిసిన క్రికెట్ టోర్నీ

కడ్తాల్: పరిధి చరికొండలో గాదమోని విజేందర్‌గౌడ్ స్మారకార్థం మూడు రోజులుగా నిర్వహించిన మండల స్థాయి క్రికెట్ పోటీలు బుధవారం ముగిశాయి. ఈ సందర్భంగా విజేత పోలే అర్జున్‌టీం, రన్నరఫ్ భీష్మాచారి జట్లకు విజేందర్‌గౌడ్ బాల్యమిత్రులు నగదు బహుమతితో పాటు, జ్ఞాపిక అందజేశారు.

దసరా వేడుకలకు ముస్తాబు

33 ఏళ్లుగా ఉత్సవాలు

- నేడు సాయంత్రం వేడుకలకు సినీనటుడు సుమన్ రాక

హుడాకాంప్లెక్స్: 'శమీ శమయతే పాపం.. శమీ శత్రువినాశనం..అర్జునస్య..ధనుర్ధారి రామస్య ప్రియదర్శనం' అని స్తుతిస్తూ..దసరా పర్వదినాన్ని వైభవంగా నిర్వహించేందుకు ఆలయాల్లో ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. విద్యుత్ దీపాలు, రకరకాల పూలమాలలతో ఆకర్షణీయంగా అలంకరణలో ఆలయాలు దేదీప్యమానంగా వెలిగిపోతున్నాయి.

ఆలయాల వద్ద ఏర్పాట్లు

దేవీనవరాత్రుల సందర్భంగా ఆయా ప్రాంతాల్లోని అమ్మవారి ఆలయాలను అందగా ముస్తాబు చేశారు. సరూర్‌నగర్, ఆర్కేపురం, జల్‌పల్లి, తుక్కుగూడ, రావిర్యాల, మీర్‌పేట్, బడంగ్‌పేట్, కందుకూరు, మహేశ్వరంలోని పలు దేవాలయాల్లో విజయదశమి సందర్భంగా భక్తుల కోసం జమ్మిచెట్టు సహా పాలపిట్ట దర్శనం ఏర్పాటు చేశారు. భక్తులు పెద్దసంఖ్యలో పోటెత్తుతున్నారు. విజయదశమిరోజు ఈ భక్తుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉంది. సరూర్‌నగర్ మున్సిపల్ గ్రౌండ్ సహా అష్టలక్ష్మీ టెంపుల్ వద్ద రావాణాసుర వధ కార్యక్రమాలను ఏర్పాటు చేశారు. ఇందుకు భారీగా బాణాసంచాలు సమకూర్చారు. ఆలయాల్లో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా తగు జాగ్రత్తలు తీసుకున్నారు. మహిళలు రకరకాల పిండి వంటల తయారీలో బిజీగా మారారు. ఆడపడుచులు, బంధువులతో గ్రామాల్లో సందడి నెలకొంది.

ఉనికి లేకుండా పోయిన పాలపిట్ట

దసరా వేడుకల్లో భాగంగా భక్తులు పాలపిట్టను దర్శించుకోవడం ఆనవాయితీ. పట్టణీకరణకు తోడు ఎత్తైన చెట్లు లేకపోవడం, పంట భూములన్నీ ప్లాట్లుగా మారడం, పరిశ్రమలు వెలిసి కాలుష్యాన్ని వెదజల్లుతుండటంతో పర్యావరణ సమతుల్యత లోపం తలెత్తి పక్షులు తమ ఉనికిని కోల్పోవాల్సి వచ్చింది. సాధారణంగా చెరువు గట్లు, పంట పొలాల వెంట కన్పించే ఈ పాలపిట్టను పంజరంలో బంధించి ఆలయాల్లో దర్శనానికి ఉంచుతున్నారు. భక్తుల్లో ఉన్న బలహీనతను కొంతమంది క్యాష్ చేసుకుంటున్నారు.



సరూర్ గ్రౌండ్స్‌లో ఏర్పాటు చేసిన జమ్మి చెట్టు



దహనానికి సిద్ధం చేస్తున్న రావాణాసుర ప్రతిమ

విజయవంతం చేయాలి



సరూర్‌నగర్ మున్సిపల్ గ్రౌండ్‌లో గత 33 ఏళ్లుగా రావణ దహన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నాం. జమ్మిచెట్టు, పాలపిట్ట దర్శనం తర్వాత రావణ దహన కార్యక్రమం నిర్వహిస్తున్నాం. ఈ ఉత్సవాలకు సినీనటుడు సుమన్ ముఖ్య అతిథిగా హాజరు కానున్నారు. నటి అనూష కూడా హాజరై.. బతుకమ్మ, దాండియా సందడిలో పాల్గొననున్నారు. భక్తులు పెద్దసంఖ్యలో హాజరై.. కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి.

– సాతెల్లి నాగరాజు, ఉత్సవ కమిటీ నిర్వాహకుడు

వర్షం తగ్గినా వరద వదలలే

- నీళ్లలోనే ఉన్న కాలనీలు
- పండుగకు ఇంటి ముందు కళ్లాపు, ముగ్గులకు దూరం
- అధికారులు పట్టించుకోవాలని కాలనీవాసుల వినతి



కోమటికుంట చెరువు అలుగుపారి రోడ్డుపై పారుతున్న వరదనీరు

బడంగ్‌పేట్: వర్షాలు కొద్దిగా తగ్గినప్పటికీ వరద మాత్రం ఏమాత్రం తగ్గడం లేదు. చెరువుల కింద కాలనీలు నీళ్లల్లోనే బిక్కుబిక్కుమంటూ గడుపుతున్నారు. చర్యలు తీసుకోవాల్సిన అధికారులు చేతులెత్తినట్లు కనపడుతోంది. మున్సిపల్ పరిధిలోని అల్మాస్‌గూడలోని చాలా కాలనీలు ముంపునకు గురికాబడ్డాయి. 3వ డివిజన్‌లోని సీవైఆర్, మధురాపురి కాలనీలు నీట మునిగాయి. 4వ డివిజన్‌లోని సౌభాగ్య లక్ష్మీనగర్ కాలనీ మొత్తం నీటిలోనే ఉంది. ఎడతెరిపిలేని వర్షాలకు వరద వస్తున్న కాలనీలు నాచు చేరడంతో బైకులు ఆదుపుతప్పి ప్రమాదాలకు గురవుతున్నారు. కాలినడకన వెలుతున్న వారు అదుపుతప్పి జారుతున్నారు. స్వేచ్ఛానివాస్, రామిడి హిల్స్ కాలనీలు సైతం నీళ్లల్లోనే ఉన్నాయి. నాదర్‌గుల్‌లోని ప్రధాన రహదారిలోనే ఉన్న గ్రీన్‌హోమ్స్ కాలనీలో వరద ఉధృతి తగ్గడం లేదు. 1వ వార్డులోని వరలక్ష్మీనగర్ సాయిరాం నగర్, న్యూబాలాజీనగర్ కాలనీలు, 24వ డివిజన్‌లోని వైఎస్‌నగర్ 1, 2, 3, జయశంకర్ తదితర కాలనీలు ముంపునకు గురికాగా కాలనీవాసులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అల్మాస్‌గూడలోని కోమటికుంట, పోచమ్మకుంట, ఎర్రకుంట నిండుకుండలా మారి అలుగు పారుతుండటం, నాదర్‌గుల్‌లోని సున్నం చెరువు కట్టకింద ఉన్న గ్రీన్‌హోమ్స్ కాలనీ వరదనీటిలోనే చిక్కుకుంది. దసరా సెలవులు ఉండటంతో పిల్లలు స్కూళ్లకు, కాలేజీలకు వెళ్లె పని తప్పడంతో పేరెంట్స్ కొంత ఊరట తీసుకుంటున్నప్పటికీ పండుగ పుట ఇంటి ముందు కళ్లాపు చల్లి ముగ్గులు వేసుకోలేని పరిస్థితి ఉందని కాలనీవాసులు బాధపడుతున్నారు. కొన్ని కాలనీలలోని ఇళ్లల్లోకి వరదనీరు,డ్రైనేజీ నీరు చేరడంతో కాలనీవాసులు లబోదిబోమంటున్నారు. ఎప్పుడో కాలనీలు ఏర్పడినప్పుడు వేసిన చిన్న డ్రైనేజీ పైప్‌లైన్ల వల్ల ఈ పరిస్థితి ఉత్పన్నమైందని కాలనీవాసులు పేర్కొంటున్నారు. ఇకనైన అధికారులు స్పందించి పాత డ్రైనేజీలను తొలగించి డయా పెంచి కొత్త లైన్లు వేస్తేనే శాశ్వత పరిష్కారం ఉంటుందని ఆ దిశగా అధికారులు దృష్టి పెట్టి కొత్త ప్రణాళికలు సిద్ధం చేసి పనులు మొదలు పెట్టాలని అధికారులను కోరుతున్నారు.



సౌభాగ్యనగర్ కాలనీలో ప్రవహిస్తున్న నీటిలో జారిపడ్డ దంపతులు

ఓట్ల లెక్కింపు కేంద్రం పరిశీలన



ఓట్ల లెక్కింపు కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఆర్డీఓ జగదీశ్వర్‌రెడ్డి, అధికారులు

మహేశ్వరం: మండల పరిధిలోని మహేశ్వరం గేటు శ్రీశైలం జాతీయ రహదారి పక్కన మహాత్మా జ్యోతిరావు పూలే బీసీ రెసిడెన్షియల్ కళాశాలలో జెడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల కౌంటింగ్ కేంద్రాన్ని కందుకూరు డివిజన్ ఆర్డీఓ జగదీశ్వర్‌రెడ్డి బుధవారం అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా కావాల్సిన సామగ్రి వివరాలు, స్ట్రాంగ్ రూమ్స్, ఇతర గదులను పరిశీలించారు. కందుకూరు డివిజన్‌లో ఉన్న మహేశ్వరం, కందుకూరు, కడ్తాల్, తలకొండపల్లి, అమనగల్లు మండలాల జెడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికలకు సంబంధించిన ఓట్ల కౌంటింగ్ మహేశ్వరం గేటు వద్ద బీసీ రెసిడెన్షియల్ కళాశాలలో జరుగుతుందని ఆర్డీఓ జగదీశ్వర్‌రెడ్డి తెలిపారు. జెడ్పీటీసీ, కౌంటింగ్ ప్రక్రియ పారదర్శకంగా జరిగేలా చూడాలని, పొరపాట్లకు తావిస్తే కఠిన చర్యలు తప్పవన్నారు. పోలీస్ బందోబస్తుపై మహేశ్వరం సీఐతో కలిసి సమీక్షించారు. అనంతరం కళాశాలలో ఉన్న గదులు, పార్కింగ్ ప్రదేశాలు, స్ట్రాంగ్ రూమ్స్‌ను పరిశీలించారు. కార్యక్రమంలో మహేశ్వరం తహసీల్దార్ చిన్న అప్పలనాయుడు, ఎంపీడీఓ శైలజ, సీఐ వెంకటేశ్వర్లు, బీసీ రెసిడెన్షియల్ కళాశాల, స్కూల్ ప్రిన్సిపాల్ సుబ్రహ్మణ్యం, వివిధ మండలాల అధికారులు పాల్గొన్నారు.

రిజర్వేషన్‌లలో ఎస్సీలకు అన్యాయం

కొత్తూరు: ఎంపీటీసీ వ్యవస్థ ఏర్పాటు నుంచి నేటివరకు ఇన్ముల్‌నర్వలో ఉన్న ఎస్సీలకు రిజర్వేషన్‌లలో అన్యాయం జరుగుతోందని ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు పెంటనోళ్ల నర్సింలు బుధవారం ఒక ప్రకటనలో ఆరోపించారు. గ్రామంలో సుమారు 800 ఎస్సీ కుటుంబాలు, 550కి పైగా ఓటర్లు ఉన్నప్పటికీ ఎందుకు ఎంపీటీసీ స్థానాన్ని కేటాయించడం లేదని అధికారులను ప్రశ్నించారు. ఏ ప్రాతిపదికన రిజర్వేషన్లు ఖరారు చేశారో సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. గ్రామంలో ఎస్సీలు జనాభా, ఓటర్ల పరంగా అధికంగా ఉన్నప్పటికీ రిజర్వేషన్లు మాత్రం దక్కడం లేదని వాపోయారు.

గిరిజనులకు అవకాశం కల్పించాలి

ఆర్డీఓకు లంబాడీ హక్కుల పోరాట సమితి నాయకుల వినతి



ఆర్డీఓకు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

షాద్‌నగర్: నియోజకవర్గ పరిధిలోని నందిగామ మండలంలో స్థానిక సంస్థల ఎన్నికల్లో గిరిజనులకు కనీసం ఒక్క ఎంపీటీసీ స్థానం అయినా కేటాయించాలని షాద్‌నగర్ ఆర్డీఓ సరితకు బుధవారం లంబాడీ హక్కుల పోరాట సమితి నాయకులు వినతిపత్రం అందజేశారు. అనంతరం పలువురు నాయకులు మాట్లాడుతూ.. స్థానిక ఎన్నికలకు ప్రభుత్వం విడుదల చేసిన షెడ్యూల్‌లో మండలంలో గిరిజనులకు ప్రభుత్వం ఒక్క ఎంపీటీసీ స్థానం కూడా కేటాయించ లేదన్నారు. నందిగామ మండల పరిధిలో 18 గ్రామ పంచాయతీలు ఉన్నాయని, వీటి పరిధిలో 9 ఎంపీటీసీ స్థానాలు ఉన్నట్లు తెలిపారు. 9 స్థానాల్లో ఒక్కటి కూడా గిరిజనులకు కేటాయించకపోడం శోచనీయమన్నారు. ప్రభుత్వం గిరిజనుల హక్కులను కాలరాసే విధంగా వ్యవహరించడం సరికాదన్నారు. గిరిజనులకు స్థానిక ఎన్నికల్లో పోటీ చేసే అవకాశం కల్పించాలని డిమాండ్ చేశారు. వినతిపత్రం అందజేసిన వారిలో లంబాడీ హక్కుల పోరాట సమితి నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి మోహన్‌నాయక్, అయోధ్య శ్రీనివాస్, పరశురాం తదితరులు ఉన్నారు.



బడంగ్‌పేట: అల్మాస్‌గూడ అమ్మవారి సన్నిధిలో భక్తజనం



బడంగ్‌పేటలో..

జయజయహే మహిషాసుర మర్దిని

దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో ఘనంగా జరిగాయి. ఆఖరు రోజు బుధవారం దుర్గామాత మహిషాసుర మర్దినిగా భక్తులకు అనుగ్రహించారు. ఈ సందర్భంగా ఆలయాలు, మండపాల్లో కొలువైన అమ్మవారికి నిర్వాహకులు వేద పండితుల మంత్రోచ్ఛారణల మధ్య విశేషపూజలు, హోమం, అర్చనలు నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు.

– సాక్షి, నెట్‌వర్క్



తుక్కుగూడ: మహిషాసురమర్దినిగా భక్తులకు దర్శనమిచ్చిన రావిర్యాల ఎల్లమ్మ తల్లి



మహేశ్వరం: మహిషాసురమర్దిని అలంకారంలో అమ్మవారు



కందుకూరు: పులిమామిడి శ్రీనిఖిల్ చేతనా కేంద్రంలో హోమం



హుడాకాంప్లెక్స్: ఉమా మహేశ్వర స్వామి సన్నిధిలో హైకోర్టు న్యాయమూర్తి వెంకటేశ్వర్‌రెడ్డి దంపతులు



మహేశ్వరం: శివగంగ రాజరాజేశ్వర ఆలయంలో హోమం చేస్తున్న భక్తులు